
# పురుగు పట్టిన పూలు

## లక్ష్మీకాంత మోహన్




ఇద్దరు బాటసారులు ఒక నిర్జనప్రదేశం గుండా నడుస్తున్నారు అదొక సన్నని కాలిబాట. దానికి రెండుపక్కలా రకరకాల ముళ్ళపొద లున్నాయి.

అప్పటికే పొద్దుగూకింది మెల్లమెల్లగా చీకటి కమ్ముకొంటూంది. సన్నసన్నగా పొగమంచు ఆవరించుతూంది ఆ యిద్దరిలో వొకరు తన చొక్కాయి చిల్లులగుండా తగులుతూన్న చలికి అబ్బా అనుకొన్నాడు అతడికి వొంట్లో బాగాలేనట్లుంది పైగా ముసలివాడు రెండోవాడు నడివయసులోవున్నాడు వారి వెంట వొక బొచ్చుకుక్కగూడా వుంది. ఆ ముసలివాడు మధ్యమధ్య ఖళ్ళా అని గాలి పీల్చడానికి ఆగుతూంటే అదిగూడా ఆగి జోరీగల్ని పట్టడానికి నోటిని టక్కుమని మూస్తూ తెరుస్తూ అసంతృప్తితో మూలుగుతూంది.

"ఇంకా యెంతదూరం పోవాలో?" అని ముసలివాడు అన్నాడు.

"ఏమో! నా కేమీ కనబట్టంలేదు." అన్నాడు నడివయసువాడు.

"కొంచెం బాగా సూడు"

"ఎంత జూసినా అంతే. పొదలూ, రాళ్ళగుటలూ, మంచూ అంతే."

"ఆకలౌతున్నది."

"నీ దగ్గిర యేమీ లేదా?"

"ఒక పుణ్యాత్మురాలు పెట్టిన సద్ది కూడు గుప్పెడుంచె కూరమాత్తరం లేదు."

"అయితే పర్వాలా; నా దగ్గిర యింత కారముంది. అన్నంగూడా మనిద్దరికీ సరిపోయేదుంది."

"మరి కుక్కకో?"

"కుక్క కేం రోగం? మనకే లేక పోతే కుక్క కెక్కడ తెద్దాం?"

"అ దేమన్నమాట! మనం తినే దాంట్లోనే దాని కింత పదేద్దాం. అది యెన్నాళ్ళమట్టో నా యెంబడి తిరుగు తున్నది"

ఆ నడివయసువాడు ముసలివాడితో వాదించడానికి జంకినట్లుంది. అందువల్ల, "సర్లే. నీ యిష్టంబాబూ!" అని గబగబా ముందుకు నడవసాగాడు అప్పటికే బాగా చీకటిపడింది. చుట్టూ మంచుముసుగు గూడా వుంటంవల్ల ఆకాశంలోని చుక్కల వెల్తురు అగుపించటంలేదు. నలిగిన బాట తెల్లగామాత్రం కనపడుతూంది. అయితే మధ్యమధ్య బాట పక్కనున్న పొదలు తమ పంజాలతో వాళ్ళని గీరటంమాత్రం వదిలిపెట్టలేదు.

పోగాపోగా వాళ్ళ కొక మర్రిచెట్టు కనపడింది. అది ఎత్తుగా దట్టంగా, గొడుగులాగా వుంది

దాన్ని చూడగానే ఆ ముసలివాడు తన భుజాన వున్న మూటని దానికింద పదేసి యిస్సురుమన్నాడు. అతడి బొచ్చు కుక్క సానుభూతిగా అతణ్ణి వాసనజూసి అసందిగ్ధంగా నిలబడింది.

"ఏమయ్యో, యిక్కడ కూల బడ్డావు? యేదన్నా వూరు దొరికేవరకూ నడవొద్దా మరి?" అన్నాడు రెండవ వాడు. "చెప్తా, యిక నేను నడవలేను. నా పని ఐపోయింది ఏమీ అనుకోమాక. ఇక్కడ నక్కగా వుంది. ఆ వున్న దేదో యింత తిని, యిన్ని నీళ్ళు తాగి, యీ రేత్రి కిక్కడే పండుకొందాం."

"నీళ్ళా? యిక్కడ నీ కెక్కడ దొరుకుతయ్యి?" అని నడివయస్సువాడు విసుక్కున్నాడు.

"కొంచెం యెతికిచూడు బాబూ."

రెండోవాడు తన చంకనున్న మూటని కిందపెట్టి అందులోనుండి వొక పెద్ద రేకుచెంబును తీసి చీకట్లోకి బైలు దేరాడు. కుక్క అతడివెంట కొంత దూరం వెళ్ళి మళ్ళా వెనక్కు తిరిగి వచ్చి ముసలాడి పక్కన కూచుంది.

ముసలాడికి మన స్సేమీ బాగా లేన



ట్లుంది. అతడు కుక్క తల నిమురుతూ యిలా ఆరంభించాడు:

"ఏమిరా రాముడూ! (అది కుక్కకి అతడు పెట్టిన పేరు) మన మింకా యెంత కాలం యిట్లా తిరగాలి? ఆ బగమంతునికి మనమీ దింకా జాలి బుట్టలేదు తీసుకు పోటానికి! అయ్యో. యెంత దుర్మార్గుణ్ణి! నా సావుతోపాటు నీ సావుగూడా కోరు కొంటున్నా. పాపం. నువ్వేం జేశావు? నోరూవాయీ లేనివాడివి..."

అతడి గొంతులోని ఆవేదన కనిపెట్టి ఆ కుక్క మూలగసాగింది. కొంత సేపటి తర్వాత చుట్టచుట్టుకొని మనిషిలా యిస్సురుమనింది. మరుక్షణంలో నిద్ర పోసాగింది.

రెండోవాడు తిరిగివచ్చాడు. "ఛీ. వెధవ జీవితం! చెంబెడు నీళ్ళకోసరం అర మైలు దూరం పోవాల్సివచ్చింది.

అదిగూడా వొక గుంటలో నీళ్ళు. ఆఁ, చెప్పటం మరిచేపోయాను. దగ్గర్లో యేదో వూరున్నట్లుంది. దీపాలు కనపడ్డయ్యి; పోదామా?" అన్నా డతను

"వద్దుబాబూ, వద్దు. నీ పుణ్య ముంటుంది. ఇక నేను నడవలేను." అని ముసలా డన్నాడు

"మరి యిక్కడ చలిలో చావాలి గదయ్యా?''

"ముడుసుకొని పడుకొంటే చలీగిలీ అంతా అదే పోతుంది. రా, యిక తిందాం, రా.''

ఇద్దరూ తిని యిన్ని నీళ్ళు తాగి పడుకొన్నారు, కుక్క ముసలాడి పక్కన ముడుచుకొని పడుకొంది. అందువల్ల అతడికి వెచ్చగా కమ్మగా వుంది

అర్ధరాత్రిపూట ముసలివాడు వున్నట్టుండి వులిక్కిపడి లేచాడు కళ్ళు తెరిచి చూశాడు. అంతా చీకటి. చుట్టూ అతడికేమీ అగుపించలేదు కొడిసేపటికి అతడికి పదిగజాల దూరంలో కుక్కల్లాగా వున్న నాలుగు ఆకారాలు అగుపించాయి అవి నక్కలు. వాటి కూతలకే అతడు వులిక్కిపడి లేవటం జరిగింది "రాముడూ!'' అని అతడరిచాడు. ఆ బొచ్చుకుక్క అదాటుగా లేచి ఆ నక్కల మీదికి దుమికింది. అవి పారిపోయాయి అతడి నేస్తం ఆ గొడవకి తిట్టుకొంటూ లేచాడు. ముసలివాణ్ణి పడుకో మంటూ విదిలించుకొని తాను మునగర దీసుకొన్నాడు. శత్రువులు అందకుండా పారిపోయినందువల్ల అవమానంతో కుక్క 'ఓ' అని అరవటం మొదలెట్టింది. ముసలివాడి నేస్తం దాన్ని బండబూతులు తిట్టాడు. ''రా రా, రాముడూ!'' అంటూ ముసలివాడు దాన్ని పిలిచి తాను గూడా పడుకున్నాడు నక్కలున్నాయిగదా, దగ్గర్లో యేదైనా స్మశానం లేకుండా వుంటుందా? అందులోనూ దాపులో యేదో వూరుందని గూడా తన నేస్తం చెప్పనుగూడా చెప్పాడు. వూరున్నచోట వల్లకాడు వుండదా? ముసలివాడికి తాను చిన్ననాడు విన్న భూతాల కథలూ అవీ గ్యాపకానికొచ్చాయి. కొంతసేపటికి అతడికి మగతగా నిద్రపట్టింది. దూరాన్నుండి నక్కల అరుపులు వినవస్తున్నాయి.

తెల్లవారుజామున అతడికి మళ్ళా మెళకువ వచ్చింది. ఖంగుఖంగు మనే శబ్దం యేదో అతడికి నిద్రలో వినిపించింది. యేమిటో శబ్దం? తన కెందుకులెమ్మని తిరిగీ పడుకొన్నాడు. కాని మళ్లా అదే శబ్దం పోయిచూస్తే? ఐనా తన కెందుకు! కుక్కగూడా లేచికూచుంది. దాన్ని చూడగానే అతడికి ధైర్యం వచ్చింది. తనబొంత కప్పుకొని కర్రపట్టుకొని లేచి నుంచున్నాడు ధ్వని వస్తూన్న వైపు నడవసాగాడు. తూర్పున తెలిరేఖలు విసనకర్రలాగా విప్పుకొంటూన్నాయి. మరేం ఫర్వాలే దనుకొన్నాడు.

అత డొక వందగజాల దూరం పోయి




నిలబడి విన్నాడు. ఇంకా కొంతదూరం నుండి ఆ శబ్దం వినవొతూంది. అతడు కాస్త తటపటాయించి అటువేపు నడిచాడు. అసంతృప్తిగా ఆవులిస్తూ కుక్క గూడా అతన్ని అనుసరించింది.

అతడి వూహ సరియైనదే. నిజంగా అక్కడొక స్మశానం వుంది. అందులో నుండే ఆధ్వని - అతడి కొక కూచున్న నల్లని ఆకారం అగుపించింది. ఆ ఆకారపు చేతులు కదులుతున్నాయి.

ఆ ఆకారం దగ్గరౌతుండగా కుక్క భౌమని ముందు కురికింది. ఆ ఆకారం గతుక్కునలేచి నిలబడింది. "రాముడూ" అని ముసలాడు కోపంగా అనగానే అది తిరిగి అతడివద్ద కొచ్చి తోకాడించింది.

అది వొక ఆడమనిషి. ఈ ముస

లాణ్ని చూడగానే తుపుక్కున వుమిసింది. కూచుని మళ్ళీ తనపని ఆరంభించింది.

"ఎవరమ్మా నువ్వూ?" అని అతడు మర్యాదగా అన్నాడు.

"ను వ్వెవరు?"

"నేనా? నే నొక బాటసారిని. బిచ్చగాణ్ని."

"ఎందు కొచ్చావ్? యేంపనిక్కడ? పైగా నీకుతోడు వొక కుక్కగూడానా?"

"కోప్పడకమ్మా ఏదో శబ్దమైతే యేమిటాఅని యిట్టా వచ్చాను గుంట తవ్వే దెందుకూ?"

"నీ కెందుకు? నా యిష్టం!"

ముసలివాడు నుంచోలేక ఆమెకి కొంచెం దూరంలో కూచున్నాడు కుక్క వున్నట్టుండి వొక మూటను నాకసాగింది

"ఆమూట యేమిటమ్మా?"

"ఇదుగో, అడుక్కుతినేవాడికి యిదంతా యెందుకూ? నన్ను వాగచ్చమాక!"

"ఈ కాలానికి అడుక్కుతినేవాణ్ణి అయినా, వొక కాలంలో బాగా బతికానమ్మా. బిచ్చగాళ్ళు మనుసులుగారా?"

అందుకు ఆమె సమాధానం యివ్వలేదు.

"నువ్వు గొప్పింటి బిడ్డవి..."

"ఎవరన్నారు?"

"ఒకరనే దేముంది? నీ బట్టలూ అదీ చూస్తే ఆ మాత్తరం తెలవదా?"

అందుకు సమాధానంగా ఆమె నిట్టూర్చింది.

"నువ్వు గొప్పింటిదానివి. నేను కడుపు మాడే బిచ్చగాణ్ణి. ఐనా, నాకూ చీమూ నెత్తురూ వుండయ్యి..."

"ఇదిగో, యెన్నిసార్లు చెప్పాలి నా పని చెడగొట్టొద్దని?"

"పనా? నీ పని నే నెందుకు శెడగొడతానమ్మా పిచ్చితల్లీ! అన్నీ శెడగొట్టుకొని ఆఖరి కిట్టా వుంవాను..."

అత దంష్టటితో ఆపాడు. అతడి కంఠం వణికింది. ఆమె అది గమనించి చలించింది

"ఆ మూటలో యే ముందమ్మా?" అని కొద్దిసేపటి తర్వాత అతడే తిరిగి అందుకొన్నాడు

"నా బిడ్డ"

"ఆడపిల్లా మగపిల్లాడా?"

"ఆడపిల్ల."

"అయ్యో, పాపం! జబ్బు చేసిందా?"

అందుకు జవాబివ్వకుండా యిస్సురు మంటూ ఆమె చతికిలబడింది.

అతడికి జాలి వేసింది. పాపం. సుకుమారి "నేను తవ్వుతా ఆ పలుగిట్టా యియ్యమ్మా." అని ముసలివాడు అన్నాడు. ఆమె మౌనంగా వుండటం చూసి అత నా పలుగు తీసుకొని తవ్వటం ప్రారంభించాడు

కాసేపు యిద్దరిమధ్యా నిశ్శబ్దం. కుక్క ఆ యిద్దరి ముఖాల్లోకీ చూస్తూ అప్పుడప్పుడూ గుంటకేసి చూస్తూంది.




"జబ్బు చెయ్యిలేదు." అంటూ ఆమె హఠాత్తుగా అందుకొంది.

"ఎట్లాగూ!" అంటూ ముసలివాడు తలెత్తి ఆమెవంక ఆశ్చర్యంగాచూశాడు.

"నేనే చంపాను! పాపిష్టిదాన్ని!!"

ముసలివాడి చెయ్యిపట్టు తప్పి, పలుగు గుంటలో వొక రాతిమీద పడి రంగున మోగింది.

"శివశివా! యెంతపాపంతల్లీ! నోరూ వాయీ లేని పసిబిడ్డని సంపటం!"

"అది నా ఖర్మ!" అని ఆమె తన నుదుర్ని కొట్టుకొంది.

"అయ్యో. అయ్యో. నీకెవరూ లేరా తల్లీ?"

"ఎవరూ లేరు."

"తల్లీ, తండ్రీ, బర్తా-యెవరూ లేరా?"

"అందరూ వున్నారు"

"మరి యెవరూ లేరంటా వేంటీ?"

"యెవరూ లేరు గనక."

"అదే-టమ్మా?"

"అది నా రాత!"

"అయ్యో పిచ్చితల్లీ. నిన్ను జూస్తూంటే నా కూతురు గ్యాపక మొస్తున్నదమ్మా..."

మళ్ళా కొంచెం సేపు నిశ్శబ్దం. వున్నట్టుండి ఆమె, "పాపం, నీకు, ముసలాడికి, నా పని అప్పగించి నేను కూచున్నాను చూడు. ఆ పలుగిట్లా యివ్వు తాతా," అని పలుగు లాక్కొంది.

ఒంటరి ప్రయాణీకులకి మిత్రత్వం త్వరగా యేర్పడుతుంది. ఆ యిద్దరికీ యెందుకో తెలవకుండానే వొకరిమీ దొక

రికి జాలి కలిగింది ఆమె చరిత్రేమిటో తెలిసికోవాలని అతడికి ఆతృత కలిగింది. అక్కడినుండీ పోబుద్ధి పుట్టలేదు.

"అసలు నీ తల్లిదండ్రు లెవరమ్మా?" అని అత డడిగాడు మెల్లగా.

"యెందుకు తాతా నీకూ? నావంటి జీవితాలు తెలిసికొంటే నీవంటి బిచ్చగాళ్ళ కేమిలాభం?"

"పర్వాలేదమ్మా. అదేమిటో తెలిసికోవాలనుంది.''

ఇంతలో గుంట పూర్తయింది. ఆమె మూట విప్పదీసింది. తెల్లని పసిపాప శవం బైటపడింది. ఆ చల్లని నెత్తురు గుడ్డును ముద్దెట్టుకొంటూ ఆమె భళ్ళున ఏడ్చింది. కుక్క ఆ పసిపాపను నాకి యెందుకో పెద్దగా అరిచింది.

"అయ్యో, ఏడవకు మా పిచ్చితల్లీ. ఈ భూమ్మీదను మనకెంత దక్కాలో అంతే దక్కుతుంది. దేనికీ మనం కర్తలం గాదు. ఏదీ, ఆ బిడ్డ నిట్లా ఇయ్యమ్మా." అని ముసలివాడు ఆ చల్లని పసిబిడ్డను చేతుల్లోకి తీసుకొని, "అయ్యో, యెంత చక్కని బిడ్డమ్మా. నీకు చేతు లెట్లా ఆడినయ్యమ్మా సంపటానికీ?? యిదేంటీ? గొంతు వాచిపోయిందే!? గొంతు పిసికి సంపావా?"

అవు నన్నట్లు ఆమె తలవూపి మళ్లా ఏడ్చింది. ముసలివాడు వోదార్చాడు. మెల్లగా ఆమె శవాన్ని గుంటలోకి దింపి మన్ను కప్పుతుండగా అతడు గూడా యింతమన్ను కప్పాడు.

తర్వాత యిద్దరూ మెదలకుండా కూచున్నారు.

"ఏమిటమ్మా నీ సంగతి? యెందుకిట్లా అయ్యావు?" అని అతడు అడిగాడు

అప్పటికి బాగా తెల్లవారింది. వారు వొకర్నొకరు బాగా చూసుకోగలుగుతున్నారు. ఆమె మంచి యౌవ్వనంలో వుంది. వయ స్సెంతో చెప్పడం కష్టం. ఆమె ముఖాన మచ్చ లున్నాయి. ఐనా, ఆ ముఖంలో మెరుపుకి అవి అడ్డం రావడంలేదు. అతడికి గడ్డమూ మీసాలూ బాగా పెరిగివున్నాయి. వృద్ధాప్యం వల్ల అతడి ముఖం వుబ్బరించివుంది. చర్మం ముడుతలుపడి పెంకులు గట్టివుంది

ఇద్దరూ ఆ సమాధి పక్కనే కూచున్నారు. ఆమె తన రవికజేబులోనుండి ఒక చిన్న అద్దంముక్క తీసి చెదిరిన తన తలవెంట్రుకల్ని సరిజేసుకొంది. ముసలివాడు అదంతా నోరుతెరచుకొని చూశాడు అదంతా అతడికి "పచ్చికలి"గా అగుపించింది. ఐనా, ఆమె జీవితం గురించి తెలిసికోవాలనే ఆసక్తి మాత్రం అతడిలో తగ్గలేదు "పాపం ఏ గొప్పింటో పుట్టిందో! ఏ బాదల వల్లో యిట్లా అయిపోయినట్టుంది," అనుకొన్నాడు. "ఏందమ్మా, సూడగా సూడగా నీ సంగతి తెలుసుకోందే నాకు పోబుద్ధి పుట్టటం లేదు," అన్నాడు

"నా సంగతా ?" అని ఆమె యెడమ కనుబొమ్మను పైకి లేపుతూ నిట్టూర్చింది. "అయ్యో పిచ్చోడా, యీ లోకంలో నువ్వొక్కడివి కనపడ్డావు నా సంగతి తెలుసుకోవా లనుకొనేవాడివి. సరే... అదేపనిగా అడిగావు గాబట్టి చెబుతున్నా. నాకు చిన్నప్పుడే పెళ్ళయింది. నా మొగుడు నన్ను యెంతో బాగా చూసే వాడు; కాని, అతడిమీద నాకు యిష్టం లేదు .."

"అవును మరి, యిష్టం లేని కూడు తినటం, యిష్టం లేని కాపరం చెయ్యటం కష్టం," అన్నాడు వృద్ధుడు.

"నేను పక్కదోవలు పట్టాను. ఒకడు నన్ను నమ్మించి లేవతీసుకు పోయాడు. తర్వాత నాదగ్గరున్న డబ్బూ, నా మెడలో బంగారుకంటే సొంతం ఐపోయినాక విడిచిపెట్టి కనపడకుండా పోయాడు. ఈనాటికీ వాడు అంతులేదు "

"హారి దుర్మార్గుడూ !''

"అప్పటినుండీ ఈ దగ్గర్లోనే వున్న వూళ్ళో వుంటున్నా. ఇంటికి పోవటానికి ముఖం చెల్లలేదు ఇప్పటికి పదిహేనేళ్ళయింది తల్లిదండ్రుల ముఖం చూసి...''

''సూడమ్మా, నీ తల్లిదండ్రులు బతికున్నారేమో తెలసా ?''

"తల్లి సంగతి తెలవదు. తండ్రి సంగతి తెలుసు. నేను పోయినాక ఆయనకి మతి చెడిపోయిందనీ పిచ్చిగాళ్ళతో తిరుగుతున్నా డనీ మావూరు మనిషి ఒకామె మూడేళ్ళ కిందట కనపడి చెప్పింది "

ఇది విన్నాక, ముసలివాడి మకమకలాడేకళ్ళు మెరిసాయి. క్రింది పెదిమా, చేతి వేళ్ళూ వణికాయి. ఏదో అనబోయి మళ్ళా ఆగి యిలా అన్నాడు :

"నీ తల్లిదండ్రులకి యెంతమంది పిల్లలమ్మా?"

"నే నొక్కదాన్నే."

ఆ మాట విని అతని గుండె గతుక్కుమంది. మళ్ళా యేదో అనబోయి ఆగి, యిలా అన్నాడు:

"నీ పేరేంటమ్మా?"

"రంగమ్మ "

ఆ మాట విన్నాక ముసలివాడు బావురుమన్నాడు ముడుతలు పడిన అతని చెక్కిళ్ళమీదుగా కన్నీళ్ళు జలజలా కారినాయి

జాలితో ఆమె కళ్ళు చెమ్మగిల్లినాయి.

"ఎందుకు తాతా యేడుస్తావూ ?" అనడిగింది. అతడు కన్నీళ్ళమధ్య యిలా అన్నాడు:

"నీకథ నాకథకుమల్లే వున్నది అంతానూ. అందుకని అది తలుపుకి వచ్చి యేడుపొచ్చింది...నాకూ వొక్కత్తే కూతు రుండేది. చిన్నతనంలోనే పెళ్ళి చేశాను యింకొకరితో లేచిపోయింది. అదంతా జరిగి సరిగ్గా పదిహేనేళ్ళయింది. తర్వాత ఆదిగుల్తో నా భార్య చచ్చి

పోయింది. నేను అప్పులపా లయ్యాను. నాకు 'నా' అనేవాళ్ళెవళ్ళూ లేక పోయారు. మతి శలించిపోయింది. పద మూడేళ్ళమట్టీ నా బిడ్డకోసరం యిట్టా తిరుగుతున్నా. నా బిడ్డ పేరుగూడా రంగమ్మే..."

ఆమెకి తనకి తెలవకుండానే కన్నీరు కారసాగింది.

"నీ పేరేటి తాతా?"

"వెంకయ్య. అంతా వెంకన్న అంటారు."

"నా తండ్రి పేరుగూడా వెంకన్నే!"

''అయ్యో పిచ్చితల్లీ, నా బిడ్డవు గాదుగదా!'' అని ముసలివాడు ఆమె జుట్టు నిమురుతుండగా ఆమె అతడిచేతిని మెల్లగా తొలగించింది.

ఉండి వుండి అతడు, ''నీ దేవూ రమ్మా?'' అన్నాడు.

''కూనపూడి.''

''ఆఁ—!!! మాదీ ఆవూరే! నీ తండ్రి పే రేంటీ?''

''వెంకయ్య''

ఆ మీదట హఠాత్తుగా అతడు, "రంగమ్మా! నువ్వు నా కూతురువే!'' అని అరిచాడు. ఆమె దడాలున లేచింది. భూతాన్ని చూసి బెదిరినట్లు పారిపో సాగింది.

ఇంతలో ఆ ముసలివాడితో కలిసి వచ్చిన బిచ్చగాడు అకస్మాత్తుగా అక్కడ కనపడ్డాడు. "రంగమ్మా!" అంటూ ఆ నడివయస్సువాడు ఆమె వెంటపడ్డాడు. ముసలివాడికి యేదో మనస్సులో మెరిసి అతడుగూడా పడుతూ లేస్తూ పరుగెత్తాడు. కుక్కకి యేమీ తోచక మూలుగుతూ అరుస్తూ ముసలివాడి వెంట వురికింది.

చివరి కెలాగైతేనేం ఆ నడివయస్సు వాడు రంగమ్మను పట్టుకున్నాడు. "పోదాంరా," అనసాగాడు.

''నీవెంటా? ఛీ, దుర్మార్గుడా! నా జీవితం పాడుచేశావు. ఇకచాలు," అని ఆమె తన పిడికెళ్ళతో అతణ్ణి కొట్ట సాగింది ఇంతలో ముసలివాడువచ్చాడు. ఆ నడివయస్సువాని గొంతు పట్టు కొన్నాడు. నడివయస్సువాడు ఆమెని విడిచిపెట్టి ముసలివాణ్ణి బలంగా గుండెలో గుద్దాడు. ముసలివాడు దభాలున ఒక బండరాతిమీద పడ్డాడు. అతడి తల పగిలింది. నెత్తురు చిందింది. ఆమె పారిపోయింది పొద్దుపొడిచింది. కుక్క దీనంగా అరవసాగింది.